"ఛఛ, మా మతంలో ఇంత అన్యాయం లేదమ్మ. మొగోళ్ళయితే పెండ్లి చేసుకోకుండానే స్వాములోర్లవుతారు. కన్నెలయితే మిస్సమ్మ లవుతారనుకుంటా – అదేదో బసివిరాండ్ర మాదిరి. నాకు పెద్దగా తెల్దనుకో. మనూరికి స్వాములోరొచ్చినప్పుడు అడిగితే తెలుస్తుంది."

"పెండ్లాలున్నోళ్ళు స్వాములోర్లు కాలేరా?"

"అయ్యేదుంది. మా వాళ్ళలో వేరే తెగ వుంది. వాళ్ళల్లో పెండ్లి చేసుకొని, బిడ్డల్ను కన్నా సంసారం చేస్తున్నా ఫాదిరీలుగా వుండొచ్చు. ఏం."

"ఏం లేదులే. ఆడోళ్ళను గాలికొదిలేసి సాధుల్లో, సన్నాసుల్లో కలిసేది మాదాంట్లోనే వుందా? మీ దాంట్లో కూడా వుందా? తెల్సుకోవాలనిపించింది... సాయిబుల్లో ఎట్లుందో?"

"ఏమో! మన ఫాతిమా నడిగితే తెలవ్వచ్చు."

ఫాతిమా మూడో మునుములోని ఆరోకయ్యలో వుంది. ఇద్దరూ చూశారు. "మీ గుసగుసలేంది? మేం యినకూడదా?" సాతాని చిన్నక్క అట్లా అడిగింది, ఇట్లా కలుపు పాట ఎత్తుకుంది:

"ముంతేడు జొన్నలిస్త
మునగపూల దండలిస్త
వస్త్రారేమొ కాంతలార
కలుపు తీయనూ..."

ఈశ్వరమ్మ అన్నీ మరచిపోయినట్లు వంతను అందుకుంది:

"రాంపో రామిరెడ్డి
రాపటెండకు
ఈ రాపటెండకు"

వంత ఒక వరస సాగింది.

"ముంతేడు కొఱ్ఱలిస్త" అని మరొక వరసను చిన్నక్క అందుకుంది. నలువురూ అందుకున్నారు. ఈశ్వరమ్మ అప్రయత్నంగా తల ఎత్తింది. తోటలోకి హడావుడిగా వస్తున్న కూతుర్ని ఈశ్వరమ్మ చూసింది. దూరంనుంచే ఆ పిల్ల గొంతెత్తి ఆనంద ప్రకటనం చేసింది.

"అమ్మా... అమ్మా... నాయనొచ్చినాడే. ఇంట్లో వుండాడే."

చిన్నక్క పాట ఆపి, మాట విసిరింది:

"పెండ్లాంగాలి ఇన్నాల్లకు సోకిందేమో!"

లూర్దమ్మ కసురుకుంది:

"అందరికీ నీ మొగుడి రందే వుంటాదనుకుంటావు."

చిన్నక్క పకపక నవ్వింది; నములుతున్న వక్కాకు ఎఱ్ఱటి ఎంగిలి రెండు వేళ్ల మధ్య నుంచి ఊసింది.

పక్క పల్లెల పొలాల్లోకి కూలీ నాలీకి ఏ పొద్దున్నో పోతే, ఇంటి దగ్గర ముసల్ది వుంది. బ్రమ్మ చెవుడు. కళ్ళకు ముదిరిపోయిన చుక్కలాలు. నడవడమే కష్టం. తాను ఇంటికి వచ్చేదాకా ఆ ముసలామెకు ఇంత తిండి పెట్టేవాళ్ళు, ఇన్ని నీళ్ళు గొంతులో పోసేవాళ్లు – అచలమ్మే లేకపోతే – ఇంట్లో ఎవరున్నారు? వీధిలో వాళ్ళు చూస్తారా? అందరికీ తడిసి మోపెడు పనులున్నాయి. అందుకే ఆ పిల్లదాని చదువును తాను మాన్పించింది.

లూర్దమ్మ ముందు ఈ బాధలన్నీ వెళ్ళబోసుకుంటే, లూర్దమ్మ తనకు తోచింది తను చెప్పింది.

"పాపం, ముసలామెదేముంది? ఈ పొద్దో రేపో పొయ్యేది. అచలమ్మ సంగతే చూడు. నాలుగు కాలాలుండేది. మా సుగుణమ్మను పంపినట్లు మరియాపురం పంపితే బాగుండదా? కనీసం మనకంటే బాగా బతకడానికి పనికొచ్చే చదువు నేర్చుకుంటుంది. అచలమ్మ చాలా తెలివైందని ప్రకాశం టీచరు కూడా ఎప్పుడో అన్నాడు. అది సరే. మన మాదిరే మన ఆడపిల్లలూ నోరూ వాయీ లేక కూలీ నాలీకి చావాలా?"

అంతా జ్ఞాపకం వచ్చి ఏదో ఒకటి తేల్చుకోవాలని ఈశ్వరమ్మ గట్టిగా అనుకుంది. ఈశ్వరమ్మ భర్త సాధునారాయణకు, ముందు ఒక గుడిసె ఏర్పాటయింది. వారసుల్లేని పక్క పల్లె తొగటోళ్ళ ముసలామె బావి తవ్వించింది. "ఉప్పునీళ్ల కొంపలో బ్రహ్మాండంగా తియ్యటి నీళ్ళు పడినాయి. సాధు నారాయణ చలవే" అని అంతా చెప్పుకున్నారు. మెల్లిగా ఆశ్రమ నిర్మాణం మొదలైంది. ఈలోగా గురుబోధలకు ఒక పందిరి ఏర్పాటైంది. ఎవరెవరు సహాయం చేస్తున్నారో, ఎక్కడెక్కడి నుంచి భక్తుల అండ వుందో, ఈశ్వరమ్మ ఏవేవో విన్నా పట్టించుకోలేదు. తన ఇంటిని అమ్మి ఆశ్రమానికి పెడుతున్నాడన్న వార్త ఈశ్వరమ్మ వరకూ వచ్చినప్పుడు మాత్రం ఆమె పూర్తిగా చలించింది.

తన బిడ్డకూ, ముసలామెకూ, తనకూ నీడ లేకుండా చేసిన విషయం నిజమో కాదో తెలుసుకుందామని రెడ్డి (గ్రామ మునసబు)ని కలుసుకుంది.

"నిజమే, బలిజ సుబ్బన్నకు అమ్మినాడు. సాక్షి సంతకం నేను చేసినా" అన్నాడు రెడ్డి. ఈశ్వరమ్మ తన గోడు వెళ్ళబోసుకుంది.

"చూడన్నా! నువ్వన్నీ తెలిసినోడివి. మిగిలింది ఈ మిద్దె. అదీ పోతే పిల్లదాని బతుకేం కావాల? పిల్ల పెండ్లికొస్తే కూలికి పొయ్యేవాడు కూడా ఎంతిస్తావంటాడే? నీకు తెల్దా? మావాళ్లు (భర్త) సంసారం విడిచి సాధుల్లో కల్సిపోయినా, సాటి కాపోళ్ళలో మాట రాకుండా ఇన్నేండ్లు బతికినా. బాలింతరాలుగా వున్నప్పుడే మావాళ్ల తల్లి చచ్చిపోయిందంట. నాయన ఏ అయిదేండ్లప్పుడో పోయినాడంట. మరి అప్పట్నుంచి మా వాళ్ళను సాకి సంతరించిన ముసలామె ఇంకా బతికే వుంది. ఆమెను నామీదనే వదిలిపాయె. కట్టుకున్నదాన్ని వదిలె. కన్నబిడ్డను వదిలె. పోనీలే అని మొండికి బడ్డా. నేను సరే – పరాయిదాన్ని. కన్నబిడ్డ సరే – ఇద్దరి బిడ్డా. మరి ముసలామెది తన రక్తంగద. ఆమెను సాకడానికి నాకేమొచ్చు – యాణ్నించో వచ్చినదానికి? అయినా చిన్నబిడ్డను సాకినట్లు ముసలామెను సాకుతున్నా. మా వాళ్లకు దయాధర్మం లేదా? న్యాయం చెప్పండి?"

ఈశ్వరమ్మ చెప్పిన దాంట్లో రెడ్డికి న్యాయం కన్పించకపోలేదు. కానీ సాధు నారాయణ చేసిన పని అధర్మమని పంచాయితీ పెట్టించలేదు. అది సాధు నారాయణ ఆస్తి! నెత్తి గోక్కుంటూ, ఈశ్వరమ్మ వైపు చూడకుండా, తనెటు వైపున్నదీ చెప్పాడు:

"నేనేం చెయ్యలేను ఈశ్వరమ్మా! నువ్వు మన కుదురులోని దానివి. ఇన్నేండ్లు ఒకరితో మాట పడకుండా బతికినావు. మన వాళ్ళందరికీ అది సంతోషమే... సాధు నారాయణ విషయం కూడా చూడు. మనం చూసినోడేలే అనుకుంటే, గొప్పతనం తెలియదు. ముప్పయేండ్ల కిందట మనూరు విడిచిపోయి కడపలో వ్యాపారం పెట్టిన పుల్లయశెట్టి, వాళ్ళ అబ్బ పేరుతో వున్న ఆ ఎకరావనాన్ని ఆశ్రమం కోసం ఇచ్చె. సాధు నారాయణ గురే లేకుంటే ఇస్తాడా చెప్పు. అదట్లా వుంచు. పరుల సొమ్ము దండి, ఆశ్రమం కట్టించినాడని ఇప్పుడెవ్వరూ అన్లేరు గదా? ఊరు మంచికే ఇది జరిగిందేమో, ఆలోచించు? నువ్వు కావాలంటే, మన కళ్ళంలోని గూడమిద్దెలో వుండు. బాడుగ అడిగితే ఒట్టు."

రెడ్డి చెప్పింది విన్నాక, ఈశ్వరమ్మ ఇంకెవరితో మొత్తుకున్నా ప్రయోజనం లేదనుకుంది. ఉండబట్టలేక మనసులో మెదలిన దాన్నంతా కూతురును ఒళ్లో పెట్టుకుని చెప్పి చెప్పి ఏడ్చింది. ఏడుస్తూ ఏడుస్తూ చెప్పింది. అచలకు అమ్మ చెప్పింది కొంత అర్థమైంది. కొంత కాలేదు. చివర్లో అంది:

"పోన్లే అమ్మా సాధునాయన గొప్పోడంటలే. చూసినోళ్లంతా కాళ్లమీద పడతా వుండారంట. యాణ్ణాన్నుంచో పాడటానికి వస్తాండారంట. రోజూ రాత్రిపూట ఏమిటో పాడతారంట. చెప్తాడంట. చానా చానా బాగుంటుందంట. మనమూ ఒకరోజు పోదాం."

ఈశ్వరమ్మ ఏదో నిశ్చయానికి వచ్చినట్టు "ఈ పొద్దే పోదాంలే" అంది – ఆరిన కన్నీళ్ళతో, గుండె దిటవుతో, చీకటి పడ్డాక అచలను వెంటబెట్టుకుని ఈశ్వరమ్మ ఆశ్రమంలోకి అడుగు పెట్టింది.

ఆవాళ శుక్ల ఏకాదశి.

పందిరి మొదట్లో మట్టి అరుగుంది. అరుగుమీద మూడు పెద్ద పటాలున్నాయి. వాటి ముందు రెండు దీపింతెలు వెలుగుతున్నాయి. పందిరిలో నేలంతా అలికి ముగ్గులు పెట్టి వుంది. అరుగు కిందనేల మీదనే సాధు నారాయణ పద్మాసనం వేసుకుని ధ్యానంలో వున్నాడు. పందిరిలో మగవాళ్లే ఎక్కువ వున్నారు. అందరూ కళ్లు మూసుకునే వున్నారు. అందరి చివరిలో ఈశ్వరమ్మ కూతురును పక్కన కూర్చోబెట్టుకుని తానూ కూర్చుంది.

"అందులో ఒకటి వేమన పటం కదామ్మా?" అచల కుతూహలంగా అంది.

ఈశ్వరమ్మ తల వూపింది.

సాధు నారాయణ కళ్లు తెరిచి పక్కనున్న ఏకనాదం అందుకుని తీగను మీటాడు. అందరూ కళ్లు తెరిచారు. బలి ఘట్టంలో నేర్చుకున్న తత్త్వాన్ని ఏకనాదం మీటుతూ సాధు నారాయణ శ్రావ్యంగా గొంతెత్తి పాడసాగాడు:

